క్లుప్తంగా

సీఎంను కలిసిన వెంకటగిరి రాజా వంశస్తులు



వెంకటగిరి(సైదాపురం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం ఎస్వీబీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర కలిశారు. వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ నేతల సమావేశం

కోట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుల మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి తెలిపారు. కోట క్రాస్ రోడ్డు వద్ద సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో ఎమ్మెల్సీ, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని పేర్కొన్నారు. యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

లక్ష్మీ నరసింహుడికి పల్లకి సేవ



చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామికి విశిష్ట పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకి సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వారికి ఇబ్బంది కలగకుండా ఈవో తాతా శ్రీనివాసులు ఏర్పాటుచేశారు.

వీరయ్యస్వామి సేవలో నేదురుమల్లి



దక్కిలి : మండలంలోని నడింపల్లిలో వెలసిన అవధూత వీరయ్యస్వామి ఆలయంలో శనివారం తిరణాళ్లను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం రాత్రి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జేసీఎస్ మండల ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, నెమళ్లపూడి సురేష్ రెడ్డి, సర్పంచ్ ఏఎం రత్నం, మోపూరు వెల్లంపల్లి ఎంపీటీసీ చంద్రశేఖరరెడ్డి, బొల్లినేని భాస్కర్‌నాయుడు, ఎం నారాయణరెడ్డి, సిద్దయ్య నాయుడు, పెంచలయ్య ఉన్నారు.

లారీని ఢీకొన్న కారు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై చెంబడిపాళెం గ్రామం వద్ద శనివారం లారీని కారు ఢీకొంది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఆదినారాయణ నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో చెంబడిపాళెం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. కారు డ్రైవర్ మోహన్, లారీ డ్రైవర్ రాజేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. డీటీవో ఆదినారాయణకు ఎలాంటి గాయాలు తగలలేదు. క్షతగాత్రులను శ్రీకాళహస్తికి తరలించారు. స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

చిల్లకూరు : తిరుపతిలో గత నెలలో సుచరి ఇండియాస్ సీవీరామన్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో చిల్లకూరుకు చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. చిల్లకూరు మిక్సడు కాలనీకి చెందిన మోరా క్రిష్ణమోహన్, నాగభూషణమ్మ కుమారుడు శ్రీరామపవన్ తిరుపతి ఎస్వీ నగర్‌లో ఉన్న కిరణ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సుచరి ఇండియాస్ సీవీ రామన్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నాడు. ప్రతిభ చూపి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్ పంజాగుట్టలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న శ్రీ సత్యసాయి నిగమమ్‌లో ప్రముఖ సినీ రచయిత చంద్రబోస్, నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

కల్యాణం.. కమనీయం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను కల్యాణ మండపంలో కొలువుదీర్చి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

సిద్ధం సభలతో ప్రతిపక్షాలు ఢీలా

- మంచిని ఓర్వలేక ఎల్లో మీడియాలో రోత రాతలు
- ప్రపంచానికే తలమానికంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థ
- వృద్ధులు, వికలాంగులను ఇబ్బంది పెట్టే యోచనలో టీడీపీ
- సిద్ధం సభ విజయవంతంపై నేదురుమల్లి కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయని, ప్రతిపక్షాలు ఢీలా పడుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరిలోని తన నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయుడుపేటలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చినట్టు తెలిపారు. 45 డిగ్రీల సెల్సియస్ ఎండను సైతం లెక్కచేయకుండా జగనన్నపై అభిమానం చూపించారని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిచోటా ప్రజాదారణ పెరుగుతోందని, దీన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలకు తొత్తులుగా పచ్చ మీడియా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.

అవ్వాతాతలను ఇబ్బంది పెట్టడమే టీడీపీ కుట్ర

ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థను దెబ్బతీసి వృద్ధులు, వికలాంగులను ఇబ్బందులకు గురిచేసేందుకు టీడీపీ యోచిస్తోందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని, పింఛన్లు తొలగిస్తామని, తమకు నచ్చిన వారికే పథకాలు ఇస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని వివరించారు. టీడీపీ నేతల వేధింపులను తట్టుకోలేక వలంటీర్లు రాజీనామా చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మొదటి సంతకం వలంటీర్ల వ్యవస్థ పునః ప్రారంభంపైనే చేస్తారని పేర్కొన్నారు.

ఒక్కటైనా మంచి ఉందా..?

టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో చెప్పుకునేందుకు ఒక్క మంచి పని అయినా చేశారా అని రామ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. సీఎం జగనన్న రెండు పేజీల మేనిఫెస్టోను ప్రకటించి వాటిలో అన్ని హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. హామీలతో పాటు అదనంగా అనేక విప్లవాత్మక కార్యక్రమాలు అమలుచేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వివరించారు. సిద్ధం సభలకు వస్తున్న ఆదరణను చూస్తే గతంకంటే అధికంగా సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయుడుపేటలో జరిగిన మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడా జానకిరామయ్య, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యస్దానిబాషా, విప్ పి.లక్ష్మి, కౌన్సిలర్లు వహిదా, కళ్యాణి, సుబ్బారావు, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న వెంటే ముస్లిం మైనారిటీలు



మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

గూడూరు రూరల్ : రాష్ట్రంలోని ముస్లింలు జగనన్న వెంటే ఉన్నారని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూం మొహిద్దీన్ తెలిపారు. ఆయన శనివారం మైనారిటీ నాయకులతో కలిసి గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న మేరిగ మురళీధర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దివంగత నేత వైఎస్ఆర్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ఇప్పుడు ఆయన కుమారుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు అన్ని రంగాల్లోనూ పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మతోన్మాద శక్తులతో పొత్తు పెట్టుకుని మైనారిటీలకు మేలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఆయన సీఎంగా ఉన్నప్పుడు మైనారిటీలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ముస్లింలు వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయనున్నట్లు తెలిపారు. మైనారిటీ విభాగం జిల్లా కార్యదర్శి అజీజ్‌ఖాన్, అల్తాఫ్, జలీల్, బాబు, హషీం, బిక్కు సాహెబ్, సుభాన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



వెంకటగిరి రూరల్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఐ సంగమేశ్వర రావు తెలిపారు. ఆయన శనివారం అమ్మపాళెం, కుప్పంపల్లి, చిన్నన్నపేట గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు తెలిపారు. ఎస్‌ఐలు సుధాకర్ రెడ్డి, జత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నా బిడ్డను ఆశీర్వదించండి'



ప్రచారం చేస్తున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

వెంకటగిరి రూరల్ : ప్రజలకు సేవ చేయడానికి తన బిడ్డ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముందుకు వచ్చాడని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. ఆమె శనివారం పాపమాంబపురం, వర్ధనపల్లి, అగ్రహారం, లక్ష్మీరాంపల్లిలో ప్రచారం చేశారు. అనంతరం ఆమె ఆయా గ్రామాల్లో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సుబ్బరామయ్య, నరసయ్య, సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా అగ్రహారంలో అనారోగ్యంతో బాధపడుతున్న వీరయ్యను పరామర్శించి ఆరోగ్యస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరరెడ్డి, పోలయ్య, చెంచయ్య, వీరయ్య, జనార్దన్‌రెడ్డి, వీరకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మంచిని గెలిపించుకుందాం'



ప్రచారం చేస్తున్న తోట గణేష్‌రెడ్డి తదితరులు

వెంకటగిరి(సైదాపురం) : కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను యధావిధిగా అమలుచేసి మంచి చేసిన జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి తంగా పేజీ రాజ్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం వెంకటగిరి మున్సిపాలిటీలోని 2వ వార్డులో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో అభివృద్ధి జరగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తిని గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో శ్రావ్యారెడ్డి, సాత్విక్‌రెడ్డి, జీవన్, నాగరాజు, శ్రీనివాసులు, జగదీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వేధింపులతో వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

తడ: టీడీపీ, జనసేన నేతల వేధింపులతో మనస్తాపం చెందిన వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో అమోసుబాబుకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనం కోసం కాకుండా తమ ప్రాంతంలోని ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు అండ్ కో వ్యాఖ్యలు తమకు వేదన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే రాజీనామా చేసినట్టు తెలిపారు. కాదలూరులోని 13 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. ఇదే దారిలో ఇతర సచివాలయాల్లో పనిచేసే వలంటీర్లు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

చెక్ పోస్టులో ముమ్మర తనిఖీలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఏర్పాటు చేసిన సరిహద్దు జిల్లాల చెక్ పోస్టులో శనివారం ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే తప్పనిసరిగా రసీదులు చూపించాలన్నారు.

మానవాళికి మార్గదర్శకం ఖురాన్

- ఖురాన్ నిత్య పఠనమే సమస్యలకు పరిష్కారం
- మసీదుల్లో భక్తి శ్రద్ధలతో షబేఖదార్



జామీయ మసీదులో బోధనలు చేస్తున్న మత గురువు

నాయుడుపేట టౌన్ : మనిషి మంచిగా జీవించేందు కు అవతరించిన దివ్య గ్రంథమే పవిత్ర ఖురాన్. మంచి జీవితం గడిపేందుకు అవసరమైన సూచనలు, ని యమాలు ఖురాన్‌లో ఉన్నట్టు మౌలానాలు, మతపెద్దలు పేర్కొంటున్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు ఖురాన్‌లో పరిష్కార మార్గం దొరుకుతుందని ప్రభోదిస్తున్నారు. ఖురాన్‌లో సూచించిన మార్గాన్నే మహమ్మద్ ప్రవక్త అనుసరించారు. దివ్య గ్రంథం ఖురాన్ అవతరించిన షబేఖదార్‌ను శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాత్రంగా జాగారం చేసి ప్రత్యేక నమాజు చేశారు.

104వ గ్రంథంగా దివ్య ఖురాన్

మహమ్మద్ ప్రవక్తకంటే ముందు అనేకమంది ప్రవక్తలు భువిపైకి వచ్చారు. వీరు 103 ఆకాశ గ్రంథాలను తీసుకువచ్చారు. చివరగా ప్రవక్త మహమ్మద్ సల్లేలాహు ఆలైహివ సల్లం కాలంలో ఖురాన్ 104వ గ్రంథంగా అవతరించింది. ఇది అన్ని గ్రంథాలకంటే ఉన్నతమైనది. ప్రళయం సంభవించే వరకు ఇది ఉంటుందని, ఈ గ్రంథాన్ని రక్షించే బాధ్యతను స్వయంగా అల్లా చేపట్టారని మతపెద్దలు చెబుతున్నారు. ఖురాన్‌లో 114 అధ్యాయాలు ఉన్నాయి వీటినే సూరాలు అంటారు. ఖురాన్‌ను 30 భాగాలుగా విభజించి వాటిని 30 పారాలుగా పేర్కొన్నారు. ఖురాన్ అవతరించి దాదాపు 1500 ఏళ్లు అయ్యాయి. దీన్ని 7, 8 సంవత్సరాల పిల్లలు సైతం కంఠస్తం చేయవచ్చు. ఈ విశ్వంలోని భూమి, ఆకాశం, సముద్రంలో ఏమేమి ఉన్నాయో అన్ని విషయాలపై స్పష్టమైన జ్ఞానం, అవగాహన ఇందులో లభిస్తుంది. ఖురాన్ చదివి దానిని అమలుపరిచేవారికి స్వర్గలోక ప్రాప్తి, నరక విముక్తి కలుగుతాయని మత పెద్దలు, మౌలానాలు చెబుతున్నారు. ఖురాన్ రంజాన్‌లో అవతరించింది. అందువల్లే మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలోనే షబేఖదార్ రాత్రి అవతరించడంతో ఆ రాత్రికి విశిష్టస్థానం లభించింది. ఈ నేపథ్యంలోనే ముస్లింలు ఈ మాసంలో ఎక్కువగా ఖురాన్‌ను పఠిస్తారు. రంజాన్ మాసంలో ప్రతి రోజూ రాత్రి ఖురాన్ పఠిస్తూ చేసే తరాబీ నమాజులకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతి రోజూ రాత్రి ఖురాన్‌లో ఒక పారాను 20 రకాతులతో నమాజు చేస్తూ 30 రోజుల్లో 30 పారాలను పూర్తిగా చదివి వినిపిస్తారు. అరబ్బీలో ఉన్న ఖురాన్ 112 భాషల్లోకి అనువాదం చేశారు. మొదట 1925లో తెలుగు ఇస్లామిక్ ట్రస్టు వారు ఖురాన్‌ను తెలుగులో అనువదించి ప్రచురించారు.

ఖురాన్‌ను ఎంత చదివినా ఆసక్తి తరగదు



ఖురాన్‌ను ఎంత చదివినా ఆసక్తి తరగదు. ప్రతి రోజూ నమాజు చేసే వారు రోజులో 50 సార్లు ఫాతిహా సూరా పారాయణం చేస్తారు. దీంతో విసుగు, విరక్తి వారి దరిదాపుల్లోకి కూడా రావు. ఖురాన్‌లోని ప్రతి వాక్యమూ మనం ఎలా బతకాలో చెబుతుంది. ఆ ప్రకారం జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే విజయవంతమైన, సంతృప్తికర జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

– షేక్ అబూబకార్, జామీయా మసీదు మౌలానా, నాయుడుపేట.

ఖురాన్‌ను నేర్పేవారు ఉన్నతులు



ఖురాన్‌ను నిత్యం పఠిస్తూ ఇతరులకు నేర్పేవారు అందరికంటే ఉన్నతులు. హదీస్ ప్రకారం ఒక హాఫీస్ (ఖురాన్‌ను కంఠస్తం చేసిన వ్యక్తి) పదిమంది వ్యక్తులను నరకం నుంచి కాపాడతారు. అత్యంత పవిత్రత ఉండే ఈ గ్రంథాన్ని నేలపై ఉంచరాదు. చేతుల్లో పట్టుకుని చదువుకోవాలి. లేదా కొద్ది ఎత్తులోనే ఉంచి చదువుకోవాలి.

– షేక్ అష్రాఫ్ అలీ, అమీర్‌షావలీ మసీదు మౌలానా, నాయుడుపేట

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా పనిచేద్దాం



సచివాలయ కన్వీనర్లకు దిశ నిర్దేశం చేస్తున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : వైఎస్సార్ సీపీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేద్దామని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ కోరారు. ఆయన శనివారం గూడూరు పట్టణం సనత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి గడపకూ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించాలన్నారు. జరిగిన మంచిని గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ నాయకుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పోల్ మేనేజ్‌మెంటు ఎంతో ముఖ్యమన్నారు. నూతనంగా ఓటు వేసే వారితో పాటు వృద్ధులను పోలింగ్ కేంద్రానికి తీసుకుని రావడం చాలా కష్టంగా ఉంటుందని, అలాంటి వారిపై దృష్టి సారిస్తే 80 శాతానికి పైగా ఓటింగ్ చేయించవచ్చన్నారు. సచివాలయ కన్వీనర్లు ముందుగా ఓటరు జాబితాపై దృష్టి పెట్టి బాధ్యతగా పనిచేయాలన్నారు. బూత్ కమిటీలు, గృహసారథులు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్లాలనిసూచంచారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, కాంద్ర నారాయణరెడ్డి, మగ్దూం, దాసరి వెంకటేశ్వర్లు, కిషోర్‌రెడ్డి, విజయ్, సుప్రియరెడ్డి, అన్నం మురళీ, మల్లికార్జున, రమేష్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే ఇంటింటా సంక్షేమం



ఆదురుపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

రాపూరు : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రతి ఇంటా సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వారు శనివారం ఆదురుపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన పథకాలు ప్రతి కుటుంబానికీ అందాయన్నారు. అవి యథావిధిగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎంను చేయాలని కోరారు. వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివరావమ్మ, నాయకులు కలపాటి మధుసూదన్ రెడ్డి, శ్రీహరిరెడ్డి, వరబాబు, సుధాకర్‌రెడ్డి, శేషబాబు నాయుడు, సుదర్శనాచారి, రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండండి'



చింతలాత్మకూరులో ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కలువాయి : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేసిందని కలువాయి జెడ్పీటీసీ అనీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం చింతలాత్మకూరులో ప్రచారం చేశారు. ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన పనులను వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. చేసిన మంచిని గుర్తుంచుకుని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిరుపతి ఎంపీగా గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సంకల వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఏలూరు ప్రభావతి, నాయకులు ఏలూరు నరసయ్య, కొర్రకూటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ న్యాయం



దండవోలులో ప్రచారం చేస్తున్న నేతలు

దక్కిలి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ న్యాయం జరిగిందని ఆ పార్టీ మండల కన్వీనర్ పి.జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వారు శనివారం దండవోలులో ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చేసిన అభివృద్ధి, మంచిని చూసి ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మోపూరు వెల్లంపల్లి ఎంపీటీసీ అలమిలి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఎం.పెంచలయ్య, బండి రమేష్‌రెడ్డి, ఎం.నారాయణరెడ్డి, పెంచలరెడ్డి, నాగభూషణంరెడ్డి, ఆర్.చిరంజీవి, డి.శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, రమణయ్య, సీహెచ్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నెలబల్లిరెట్టపల్లిలో బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

చిల్లకూరు : స్థానిక దళితవాడలో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. కొండేటి శీనయ్య తన కుటుంబంతో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో వారు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని సామగ్రిని తీసుకువచ్చేందుకు యత్నించినా వీలు కాలేదు. పంట విక్రయించిన నగదు రూ.28 లక్షలు, బీరువాలోని 9 సవర్ల బంగారు నగలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గూడూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అదేవిధంగా నెలబల్లిరెట్టపల్లిలోనూ అగ్ని ప్రమాదంలో పసుపులేటి కుటుంబం నష్టపోయింది. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది శనివారం గ్రామానికి చేరుకుని విచారించారు. నెలబల్లిరెట్టపల్లిలో పసుపులేటి స్వామి, చిల్లకూరు దళితవాడకు చెందిన కొండేటి శీనయ్య కుటుంబాల వారికి తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ రమ్యస్వాతి, వీఆర్వోలు రమణయ్య, భాస్కర్ వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అలాగే 25 కేజీల బియ్యం, కూరగాయాలు అందజేశారు.

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం

సార్వత్రిక ఎన్నికల్లో వయోవృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పిస్తోందని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయాన్ని గ్రామాల్లో వివరించి వయోవృద్ధులు ఓటు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు.

నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

వెంకటగిరి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి కలిగిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన శనివారం వల్లివేడు పంచాయతీ వల్లివేడు, తిమ్మాయిగుంట, బుసపాళెంలో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు సైతం ఇంటి వద్దకే పరిపాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అవినీతి లేని సమర్థవంతమైన పరిపాలన మళ్లీ రావాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వరమ్మ, సాయిరాంరెడ్డి, రాజారెడ్డి, బర్రి రామచంద్రారెడ్డి, మల్లికార్జున్, వెంకటయ్య, సర్పంచ్ నిర్మల, పెంచలరెడ్డి, మురళీ, రంగయ్య, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



దక్కిలి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దక్కిలి : సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. ఆయన శనివారం విద్యార్థులతో కలిసి దక్కిలిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకటగిరి–రాపూరు రోడ్డులోని కమ్మపల్లి రోడ్డు సెంటర్ వరకు సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమన్నారు. తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకోవచ్చన్నారు. ఎంపీడీవో లీలామాధవి, ఎస్‌ఐ చౌడయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రాజేష్, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



బాలాయపల్లిలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ పుల్లారావు, అధికారులు

బాలాయపల్లి (దక్కిలి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. ఆయన శనివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒత్తిళ్లకు లొంగకుండా నచ్చిన వారికి ఓటు వేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకటగిరి–గూడూరు రోడ్డు సెంటరు వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, ఎంఈవో–2 బీరం ప్రదీప్, ఏపీవో మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.